క్లుప్తంగా

విఘ్నేశ్వరుని సన్నిధిలో శ్రీకాంత్



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో పూజలు చేస్తున్న పినిపే శ్రీకాంత్ తదితరులు

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్ పార్టీ శ్రేణులతో కలిసి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి శ్రీకాంత్ ప్రత్యేక పూజలు చేశారు. తన తొలి అడుగు స్వామివారి ఆశీస్సులతో మొదలు పెట్టినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గన్నవరపు శ్రీనివాస్, అమలాపురం మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణితో పాటు, పట్టణ నాయకులు, పార్టీ మండల నాయకులు పినిపే బుజ్జి తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



బోయి సీతమ్మ (ఫైల్)

మామిడికుదురు: గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బోయి సీతమ్మ (102) గురువారం కన్నుమూశారు. ఆమె 1923లో జన్మించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు సంతానం. ఇంకా 23 మంది మనవలు, 37 మంది ముని మనవలు, ఏడుగురు ఇని మనవలున్నారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

నేడు పొళ్లమ్మ జాతర



మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పొళ్లమ్మ జాతర మహోత్సవం శుక్రవారం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ సాధనాల సుబ్బారావు గురువారం తెలిపారు. అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 18 నుంచి నాలుగు రోజుల పాటు జరుగుతాయన్నారు. అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని పలు రకాల పుష్పాలు, రంగులతో సుందరంగా అలంకరించారు. విద్యుద్దీప కాంతులతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. భారీగా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

స్టేట్ ర్యాంకర్ శరవణికి సత్కారం



ఇరుసుమండలో శరవణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

అంబాజీపేట: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో స్టేట్ టెన్త్ ర్యాంక్ సాధించిన వీరంశెట్టి శరవణిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సన్మానించారు. ఇరుసుమండకు చెందిన కోనసీమ ఆహారనిధి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ కుమార్తె శరవణి ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా శరవణిని శాలువాతో సత్కరించి, మొక్కను బహూకరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ అన్యం రాంబాబు, అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, రాష్ట్ర నీటి సంఘం డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరావు తదితరులు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా శరవణి మాట్లాడుతూ, తన తల్లిదండ్రుల ప్రోత్సాహం, తాను చదివిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల ప్రోత్సాహంతో ర్యాంక్ సాధించానని చెప్పారు. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీర్ కావాలన్నది తన లక్ష్యమని తెలిపారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామంలోని నల్లివారిమెరకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఉప్పాటి సుభద్ర, సత్యవతి కుటుంబాలకు గురువారం నిత్యావసరాలు అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టార్పాలిన్, వంట సామగ్రి, రగ్గు, బియ్యం, కూరగాయలు, చీరలు అందజేశారు. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల సమన్వయకర్త జంపన బుజ్జిరాజు ఆధ్వర్యంలో ఈ పంపిణీ జరిగింది. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సహాయ కార్యదర్శి బోనం రాజు, సభ్యులు మధురాజు, ఆకారం మాస్టారు, భూపతిరాజు సత్తిబాబురాజు, ఈశ్వరరాజు వర్మ, వీఆర్వో సత్యనారాయణ, రమేష్, శేఖర్, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, ఎంపీటీసీ భూపతిరాజు లక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట.. ఎంతో మేలంట..!

- మూడో పంటగా సాగు చేయాలి
- భూసారమూ గణనీయంగా వృద్ధి
- రసాయన ఎరువుల నియంత్రణ
- పంట దిగుబడికి లాభదాయకం



గంగలకుర్రులో సాగు చేస్తున్న జీలుగ

అంబాజీపేట: రబీ వరికోతలు పూర్తవ్వగానే మూడో పంటగా పచ్చిరొట్టను సాగు చేపడితే భూమిలో సారం పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ఎక్కడ చూసినా విచక్షణా రహితంగా రసాయన ఎరువుల వాడకం పెరిగిపోయింది. రసాయన ఎరువుల అధిక వినియోగం, పంటల మార్పిడి విధానాన్ని పాటించకపోవడం వలన భూసారం కోల్పోతున్న విషయాన్ని రైతులు నిర్లక్ష్యం చేస్తున్నారు. గతంలో రైతులు భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైర్లను రబీ పంటల అనంతరం వేసేవారు. ఇటీవల కాలంలో పచ్చిరొట్ట పైర్ల పెంపకం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో భూసారం తగ్గి పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. రైతులు ఈ తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయన మందులను పిచికారీ చేసి అనర్థాలను కొనితెచ్చుకుంటున్నారు. రబీ పంట అనంతరం పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారం బాగా పెరుగుతుంది. అలాగే కొబ్బరి తోటల్లోనూ పచ్చిరొట్ట పైరును కొందరు రైతులు పెంచుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 600, కొత్తపేట నియోజకవర్గంలో 750, రాజోలులో 976 ఎకరాల్లో జీలుగ, పిల్లిపెసర, జనుము సాగు చేపట్టారు.

స్థూల పోషకాలు అధికం

జనుము, జీలుగ, పిల్లిపెసర తదితర రకాలను రబీ పంట అనంతరం సాగు చేయాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వారి వివరాల మేరకు, వీటిని పూత దశ వరకు పెంచి భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు, సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. అలాగే నేలలు సంపూర్ణమై ఉత్పాదకత పెరుగుతుంది. భూమిలోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికితీస్తాయి. సేంద్రియ కర్బనం పెరుగుతుంది. ఈ పైర్ల సాగు వలన 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. గుళికలను అధికంగా వాడడం వలన భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నాయి. పంటల పెరుగుదలకు ఉపయోగమైన సూక్ష్మజీవులు నశించడం వలన దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడం వలన తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



రాబోయే తరాలకు భూమిని సారవంతంగా ఉంచాలంటే పచ్చిరొట్ట ఎరువులు వేయాలి. ప్రధాన ఎరువులకు చేసే ఖర్చును తగ్గించుకుని, నికర లాభం పొందడానికి వీలవుతుంది.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఏడీఏ, అంబాజీపేట

జగ్గిరెడ్డిని కలిసిన గొల్లపల్లి



చిర్ల జగ్గిరెడ్డిని కలిసిన గొల్లపల్లి సూర్యారావు తదితరులు

మలికిపురం: నూతనంగా నియమితులైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మర్యాదపూర్వకంగా కలిశారు. గోపాలపురంలోని జగ్గిరెడ్డి నివాసంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. రాజోలు నియోజకవర్గ నాలుగు మండలాల అధ్యక్షులు అడబాల వీరబ్రహ్మాజీరావు, కుసుమ చంద్రశేఖర్, బొలిశెట్టి భగవాన్, కట్టా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కటకంశెట్టి ఆదిత్య, పాటి శివకుమార్, సూరిశెట్టి బాబి, కంచి వెంకటరమణ, గుబ్బల రోజారమణి, రాంబాబు, ఈద రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



జగ్గిరెడ్డిని కలసిన రాజోలుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు

రాజోలు: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం రాజోలు మండలానికి చెందిన పలువురు నాయకులు జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి తెన్నేటి కిషోర్, పార్టీ నాయకులు స్టూడియో వర్మ, మోకా సురేష్, చింతా శ్రీను, అడబాల జానకిరామ్, మహేంద్ర, రాజేష్ తదితరులు కలసి జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జగ్గిరెడ్డికి అభినందనలు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కలసి కట్టుగా కృషి చేయాలని, అన్ని గ్రామాల్లో జగ్గిరెడ్డి పర్యటిస్తారని చెప్పారని ఎస్సీ సెల్ కార్యదర్శి కిషోర్ తెలిపారు. జగ్గిరెడ్డి నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

కొత్తపేట: రైతులకు ఆయిల్ పామ్ సాగుతో కలిగే ప్రయోజనాలపై పలు గ్రామాల్లో సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం కొత్తపేట, వానపల్లి, వాడపాలెం, కేదార్లంక, అవిడి గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది. వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసి ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, రైతు చైతన్య కార్యక్రమాలను ప్రతినిధులు వివరించారు. ఉద్యాన శాఖ అధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగాల నియామకం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన మండలాల పార్టీ యువజన విభాగ కమిటీల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. రాజోలు నియోజకవర్గంలోని మలికిపురం మండల పార్టీ యువజన కమిటీ అధ్యక్షుడిగా కొప్పిశెట్టి హేమ పూర్ణ రాము, మామిడికుదురు మండల (పార్ట్) అధ్యక్షుడిగా ఉచ్చుల మోహన్, రాజోలు మండల అధ్యక్షుడిగా వాసంశెట్టి శ్రీహరి, సఖినేటిపల్లి మండల అధ్యక్షుడిగా గేదెల చిట్టిబాబును నియమించింది. అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం పట్టణ అధ్యక్షుడిగా ఫణి దూడల, రూరల్ మండల అధ్యక్షుడిగా కేతా భానుతేజ, అల్లవరం మండల అధ్యక్షుడిగా బళ్ల శ్యామ్‌కుమార్, ఉప్పలగుప్తం మండల అధ్యక్షుడిగా ఓగూరి విజయ్ కుమార్ నియమితులయ్యారు. అలాగే రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం పట్టణ అధ్యక్షుడిగా శలగల మధురాజు, రామచంద్రపురం మండల అధ్యక్షుడిగా తెలగాని సూర్య ప్రకాష్, కాజులూరు మండల అధ్యక్షుడిగా పింకె వెంకట రమణ, కె.గంగవరం మండల అధ్యక్షుడిగా మేడిశెట్టి గోవిందరాజును నియమించింది. పి.గన్నవరం నియోజకవర్గంలోని అయినవిల్లి మండల అధ్యక్షుడిగా కుసుమ వెంకటరమణ, అంబాజీపేట మండల అధ్యక్షుడిగా సూదాబత్తుల రామారావు, మామిడికుదురు మండల (పార్ట్) అధ్యక్షుడిగా మట్టపర్తి శ్రీమన్నారాయణ, పి.గన్నవరం మండల అధ్యక్షుడిగా మట్టపర్తి సోమశేఖర్‌ను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



మాకనపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న ర్యాలీ

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని అడిషనల్ డీపీఎం సత్యనారాయణ అన్నారు. మాకనపాలెం గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ, ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలు మానవ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. క్రిమి సంహారకాలు, రసాయనాలు వినియోగించిన పదార్థాలు వినియోగించడం వల్ల మానవ శరీరంపై దుష్ప్రభావాలు చూపుతాయన్నారు. సహజ సిద్ధంగా లభించే వనరులతో సాగు చేసిన పంటల వల్ల ఎటువంటి సమస్యలు ఉండవని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు నయనాల శ్రీరంగనాథం, కోలా శ్రీనివాసరావును సన్మానించారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

అయినవిల్లి: తొత్తరమూడి మండల మహిళా సమాఖ్య భవనంలో కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. సర్పంచ్ వార జయసావిత్రి అధ్యక్షత వహించారు. మొత్తం 35 మంది కుట్టు శిక్షణ తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ భీమారావు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మామిడికుదురు: పాశర్లపూడి సత్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఈ శిక్షణను ప్రారంభించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక స్త్రీశక్తి భవనం వద్ద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. మొత్తం 115 మందికి రెండు బ్యాచ్‌ల్లో నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఎంపీడీఓ కె.విజయప్రసాద్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, వైస్ ఎంపీపీ పప్పుల సాయిబాబు, వెలుగు ఏపీఎం ఆర్.మురళీకృష్ణ, ఎంపీటీసీ పులపర్తి చినవెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై విద్యార్థులకు అవగాహన



అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొత్తపేట: విపత్తులు–ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలి, తమను తాము ఎలా రక్షించుకోవాలనే అంశాలపై స్థానిక అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక భాష్యం స్కూల్ ఆవరణలో ప్రమాదాల సమయంలో జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపాల్ జె.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎం.లోకేశ్వరరావు, చాంప్స్ ప్రిన్సిపాల్ ఎస్.రమాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ



గుడిమూల అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: ఐసీడీఎస్ రాజోలు విభాగం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాలెం సెంటర్‌లో గురువారం పిల్లల పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లల్లో పౌష్టికాహార ప్రాధాన్యం, వారి ఎత్తు, బరువుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ నెల 23 వరకూ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

పోషణ్ పఖ్వాడా

ఐసీడీఎస్ రాజోలు విభాగం ఆధ్వర్యంలో రామేశ్వరం, గుడిమూల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పఖ్వాడా పేరుతో పోషకాహార ఆవశ్యకతలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్‌కే మీరా మున్సీసా, కె.చంద్రలీల ఆధ్వర్యంలోను సదస్సులు జరిగాయి. పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

అందరికీ పని కల్పించాలి

అంబాజీపేట: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. వక్కలంకలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి అధ్యక్షతన చెరువు పూడికతీత పనులకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 12,240 పని దినాలతో రూ.37 లక్షలతో ఈ చెరువు పనులు చేస్తున్నామన్నారు. తొలుత చెరువు గట్టు వద్ద ఉన్న దేవాలయం నిర్మాణానికి సంబంధించి వివాదాస్పద స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఓ దశలో ఆయన సమక్షంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమస్యను తన కార్యాలయంలో పరిష్కరిద్దామని ఇరువర్గాలకు ఎమ్మెల్యే సూచించడంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నమయ్య స్వరార్చనతో వాడపల్లి పులకింత



వాడపల్లి క్షేత్రంలో శ్రీనివాసరావు స్వరార్చన నడుమ నిత్య కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం అన్నమయ్య స్వరార్చనతో పులకించింది. స్వామివారి నిత్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలోని వసంత మండపంలో నిత్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో పండితులు కల్యాణ కృతువు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆస్థాన సంకీర్తనాచారి కరుటూరి శ్రీనివాసరావు.. అంతయు నీవే హరి పుండరీకాక్ష జక్కుడపు చనవుల జాతర.. పిడికెడు తలంబ్రాల పెండ్లికూతురు.. తదితర సంకీర్తనలను ఆలపించారు. శాస్త్రోక్తంగా నిత్య కల్యాణ మహోత్సవం, మరోవైపు అన్నమయ్య సంకీర్తనల ఆలాపన స్వర మాధుర్యంతో భక్తులు తన్మయత్వం చెందారు.

ఆలయ ముఖద్వారం పరిశీలన

వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో ఆలయ ముఖద్వారం పునర్నిర్మాణం చేసేందుకు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావుతో కలిసి దేవదాయ శాఖ స్థపతి డిప్యూటీ కమిషనర్ పి.పరమేశప్ప ఆలయ పరిసరాలను పరిశీలించారు. అలాగే క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న టాయిలెట్స్‌ను, కోనేరు నిర్మాణ పనులపై ఆరా తీశారు. రాష్ట్ర ఆగమ సలహాదారు ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీపై అవగాహన

కొత్తపేట: వచ్చే విద్యా సంవత్సరానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీపై గురువారం స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరానికి మండలంలో 4,423 విద్యార్థులకు కిట్లు రానున్నాయని చెప్పారు. వాటిని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచి, పాఠశాలలకు అందించాలని సూచించారు. ఈ కిట్లలో ప్రతి విద్యార్థికి 3 జతల యూనిఫారం, బ్యాగ్, పాఠ్య, వర్క్, నోట్ పుస్తకాలు, బెల్ట్, షూలు, సాక్స్, డిక్షనరీ ఉంటాయని తెలిపారు. ట్రాన్సిషన్ వారోత్సవాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 16 నుండి 23 వరకు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రవేశాలు పెంచాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల్లో ఆర్‌టీఈ యాక్ట్–2009 ప్రకారం పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. అర్హత ఉన్న వారు ఈ నెల 28 నుండి మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి తెలిపారు.

లాంగ్వేజీలపై పట్టు సాధించాలి

డీఈఓ సలీం బాషా

అంబాజీపేట: విద్యార్థులు లాంగ్వేజీలైన తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లపై పట్టు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా అన్నారు. ముక్కామల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ట్రాన్స్‌షన్ వారోత్సవాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి ఇప్పటి నుండే ప్రణాళికలు సిద్ధం చేసుకుని, అందుకనుగుణంగా చదవాలన్నారు. వచ్చే ఏడాది పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇప్పటి నుండి లాంగ్వేజీలపై శ్రద్ధ వహిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా రాగి జావను విద్యార్థులకు అందించారు. ఆయన వెంట హెచ్‌ఎం ఎంఎస్ఆర్ మూర్తి, సీఆర్పీ దుర్గారావు ఉన్నారు.

సీహెచ్‌ఓల హక్కులను పరిరక్షించాలి



పెదపళ్లలో వైద్యాధికారి సాయికిషోర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీహెచ్‌ఓలు



లూటుకుర్రులో ధర్నా చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు



సఖినేటిపల్లి పీహెచ్‌సీ వద్ద సీహెచ్‌ఓల నిరసన



లక్కవరంలో నిరసన తెలుపుతున్న ఆరోగ్య సిబ్బంది

పీహెచ్‌సీల వద్ద ఆందోళన

అల్లవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ మందిరాల్లో వైద్యారోగ్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల వద్ద గురువారం సీహెచ్‌ఓలు శాంతియుత నిరసన చేపట్టారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం సీహెచ్‌ఓలను సత్వరమే రెగ్యులర్ చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని, గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 23 శాతం జీవన భృతి కల్పించాలని, బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లపై స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

వేతన సవరణ కోరుతూ నిరసన

మామిడికుదురు: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆందోళన చేపట్టారు. ఆరోగ్య కేంద్రం అద్దె, ఎలక్ట్రిసిటీ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా రావాల్సిన ప్రోత్సాహకాలను ఇవ్వడం లేదని వాపోయారు. ఫలితంగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని పీహెచ్‌సీ ఎదుట ప్లకార్డులు ప్రదర్శించారు. రెండు పీహెచ్‌సీలో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు ఈ నిరసనలో పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సఖినేటిపల్లి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక పీహెచ్‌సీల సీహెచ్‌ఓలు ఆస్పత్రి వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం సీహెచ్‌ఓలను వెంటనే క్రమబద్ధీకరించాలని, పెండింగ్ ఇన్సెంటివ్‌లను వెంటనే విడుదల చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, ఈపీఎఫ్ పునురుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి నెలా ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరోగ్య సిబ్బంది నిరసన

మలికిపురం: మండలంలోని లక్కవరం పీహెచ్‌సీ వద్ద ఆరోగ్య సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విభాగంలో ఆరేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, వారిపై పెరుగుతున్న ఉద్యోగ భారం తగ్గించాలని కోరారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. హెల్త్ ఆఫీసర్లు పావని, భువన, జిల్లా యూనియన్ అధ్యక్షురాలు పి.మమత జ్యోతి, సిబ్బంది ఎ.చంటి, బి.నరసింహారావు, సీహెచ్ లలిత, కె.మరియమ్మ, లక్కవరం, కేశనపల్లి పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యనారాయణ సేవలు వెలకట్టలేనివి

మామిడికుదురు: ఎమ్మార్పీఎస్ విధాన నిర్ణయ మండలి సభ్యులుగా ఆకుమర్తి సూర్యనారాయణ ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగతో కలిసి ఎన్నో పోరాటాలు చేశారని ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ అన్నారు. స్థానిక బస్టాండ్ కూడలిలో గురువారం సూర్యనారాయణ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు ముసూడి నాగప్రభాకర్, ఆకుమర్తి ఆశీర్వాదం, చుట్టుగుళ్ల నీలకంఠం, చుట్టుగుళ్ల కిశోర్, శెట్టెం శ్రీనివాస్ పాల్గొన్నారు.